



మార్ట్‌లో భారీ చోరీ.. 2



2 గుంతలో పడిన కారు


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## తెయూలో ముగిసిన డిగ్రీ పరీక్షలు



**అక్షరటుడే,డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గత నెలలో ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. శుక్రవారం ఉదయం జరిగిన నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 293 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 282 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.





## అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: భూపతిరెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అన్ని వర్గాల అభ్యున్నతిని ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మత్స్య ప్రగతి, ప్రణాళిక సమావేశం నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ఇదివరకు మత్స్యశాఖకు సంబంధించి కార్యక్రమాలు మొక్కుబడిగా జరిగేవని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తూ మత్స్య కార్మికుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. అర్సపల్లిలో ఎంతో విలువైన మత్స్య కార్మిక సంఘం స్థలం కబ్జాకు గురి కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, సీసీ కెమెరాలు పెట్టిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ ఆంజనేయ ప్రసాద్, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వాల్ పెయింటింగ్ వేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 10న జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని మిర్చి కాంపౌండ్ రోడ్‌లో శుక్రవారం వాల్ పెయింటింగ్ వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ లో సుమారు రూ.8 వేల కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధా ని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని తెలిపారు. 10న సాయంత్రం 5 గంటలకు జరిగే బహిరంగ సభకు ఇందూరు జిల్లా వాసులు భారీగా తరలిరావాలన్నారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న మోదీకి ఆహ్వానం పలకాలన్నారు. మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, దాంపల్లి మురళి, బంటు ప్రవీణ్, కైరంకొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా అల్ప్రాజోలం దందా




- మహారాష్ట్ర నుంచి డంపింగ్
- జిల్లాలోని కల్లు ముస్తేదారులకు సరఫరా
- చక్రం తిప్పుతున్న నేతలు.. పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

***రోజంతా కష్టపడి వచ్చిన కూలీలు, ఇతర శ్రమ జీవులు సాయంత్రం ఇంటికి వచ్చాక కల్లు తాగుతారు. అలాంటి కల్లును కల్తీ చేసి వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజలు రోగాల పాలై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతుండగా, మరికొందరు మృత్యువాత పడుతున్నారు. అల్ప్రాజోలంతో జిల్లాలో జోరుగా కల్తీ కల్లు దందా సాగుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.*** **- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా కేంద్రం అయిన తర్వాత రవాణా వ్యవస్థ పెరిగింది. రాకపోకలు పెరిగాయి. నేరాలు సైతం పెరిగాయి. ముఖ్యంగా రైల్వే మార్గం ఉండడంతో నేరస్తులు పోలీసులకు చిక్కకుండా రైళ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి నిషేధిత మత్తు పదార్థాలను ట్రైన్‌లలో తీసుకు వస్తున్నారు.

### పక్క రాష్ట్రం నుంచి..

కామారెడ్డికి అతి దగ్గరగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. ఆ రాష్ట్రంలోని నాగ్‌పూర్, నాందేడ్, కర్ణాటక నుంచి సైతం నిషేధిత మత్తు పదార్థాల రవాణా సాగుతుందని తెలుస్తోంది. రోడ్డు మార్గం ద్వారా ఈ ప్రాంతాల నుంచి రాకపోకలకు ఎక్కువ సమయం పట్టడం, రవాణా ఖర్చులు కూడా ఎక్కువ కావడం ఎక్కడికక్కడ చెక్ పోస్టులు, పోలీసుల తనిఖీలతో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. రైల్వే మార్గం అయితే తనిఖీలు తక్కువగా ఉంటాయి. దీంతో వ్యాపారులు రైళ్లలో మత్తు పదార్థాలను రవాణా చేస్తున్నట్లు సమాచారం.

### భారీగా లాభాలు

మహారాష్ట్ర, నాగ్‌పూర్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సేకరిస్తున్న అల్ప్రాజోలంను జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద ఎవరికీ అనుమానం రాకుండా సేకరిస్తున్నారు. అనంతరం ఇక్కడి నుంచి జిల్లాలోని కల్లు ముస్తేదారులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. గ్రాము అల్ప్రాజోలం విలువ రూ.వేలల్లో ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకు దీనికి తీసుకొచ్చి కొందరు ఇక్కడ భారీ రేట్లకు విక్రయిస్తూ దందా చేస్తున్నారు. దీంతో కల్లు తయారు చేస్తున్నారు. నిషేధిత పదార్థాలను కల్లు డిపోలలో నిల్వ ఉంచి దానితోనే కల్లు తయారు చేస్తున్నారు. కల్తీ కల్లు తాగి పలువురు అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నారు.

### నాయకుల హస్తం

అల్ప్రాజోలం దందాపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి. అధికారులు ఎవరినైనా పట్టుకుని కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్టుగా అనుమానం వస్తే ముఖ్య నేతల ద్వారా కేసులు కాకుండా ప్రయత్నాలు చేసినట్టుగా తెలుస్తోంది. ఈ దందాలో పలువురు మండల నాయకుల హస్తం ఉన్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిపై చర్యలకు అధికారులు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.

### కేసులు నమోదు చేస్తున్నాం

జిల్లాలో అల్ప్రాజోలం సరఫరాపై నిఘా పెడుతున్నాం. పక్కా సమాచారంతో దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఈ సంవత్సరం 12 కేసులు నమోదు చేసి 23 మందిని అరెస్ట్ చేశాం. 11 కిలోల అల్ప్రాజోలం, 8 వాహనాలను సీజ్ చేశాం. దానిని సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవు.

**– హన్మంత్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్**



## భగవంతుడి నామస్మరణ చేస్తూ భక్తిమార్గంలో నడవాలి

**అక్షరటుడే, కోటగిరి:** ప్రజలు నిత్యం భగవంతుడి నామస్మరణ చేస్తూ భక్తిమార్గంలో నడవాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోతంగల్ మండలం హంగర్గా ఫారంలో పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ్లూర్ మహారాజ్, వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మమ్మలనేని రాజశేఖర్, పుప్పల శంకర్, ఎజాజ్ ఖాన్, దిలీప్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## పోడు భూముల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జుక్కల్ నియోజకవర్గంలో పోడు భూముల క్రమబద్ధీకరణను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. రాష్ట్ర రాజధానిలోని సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని, కావాల్సిన నిధుల విషయమై మంత్రితో మాట్లాడారు. అనంత రం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులను వెనువెంటనే విడుదల చేయాలని కోరారు. ఎల్లారం తండాకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన పొంగులేటి లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు కలగనీయకుండా నిధులు మంజూరు చేయాలని సూచించారు. అర్హత గల ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ‘మీరు మద్దతు ఇస్తే ఓకే.. మేమిస్తే తప్పా..?’



**అక్షరటుడే, కామారెడ్డి:** బీఆర్ఎస్, కాంగ్రెస్ జెండాలు వేరైనా అజెండా ఒక్కటే అంటూ బీజేపీ కౌన్సిలర్లు చేసిన వ్యాఖ్యలను.. గులాబీ పార్టీ కౌన్సిలర్లు తప్పుబట్టారు. పలు మున్సిపాలిటీలను ఉదహరిస్తూ అక్కడ మీరు మద్దతు తెలిపితే తప్పులేదు కాని.. తాము మద్దతిస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడటం సరికాదన్నారు. ఛైర్మన్, కో ఆప్షన్ ఎన్నిక సమయంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలపాల్సి వచ్చిందన్నారు. కేవలం కామారెడ్డి మున్సిపల్ అభివృద్ధి కోసమే మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు భైంసా, అమన్ గల్, ఖానాపూర్‌తో పాలు పలు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు బీజేపీ దక్కించుకోలేదా అని నిలదీశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరిస్వామి, కౌన్సిలర్లు అరికెల ప్రభాకర్ యాదవ్, మామిండ్ల లక్ష్మణ్, మన్సూర్ అలీ, అజీజ్, హాఫీజ్ బేగ్, లోలం శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు కుంబాల రవి యాదవ్ పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామి ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నియోజకవర్గ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రబిందువుగా నిలిచిన కాలభైరవ స్వామి దేవస్థాన అభివృద్ధిపై ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష నిర్వహించి భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. ఆలయ పరిసరాల అభివృద్ధి, రహదారులు, తాగునీటి సౌకర్యం, లైటింగ్, పార్కింగ్, మరుగుదొడ్లు, భక్తుల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. దేవస్థాన అభివృద్ధి పనుల్లో ఛైర్మన్, డైరెక్టర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఉత్సవం, పూజా కార్యక్రమంలో కమిటీ సభ్యులంతా చురుకుగా పాల్గొనాలని స్పష్టం చేశారు. దేవస్థాన నిధుల సమీకరణను బలోపేతం చేసేందుకు గతంలో విరాళాలు అందించిన దాతలను తిరిగి సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఛైర్మన్ స్వయంగా ముందుండి విరాళాలు అందించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. దాతలతో ప్రత్యక్షంగా సమావేశమై ఆలయంలో జరుగుతున్న ధార్మిక, సేవా కార్యక్రమాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించాలని తెలిపారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలు, ఉత్సవాలపై ఫ్లెక్సీలు, బ్యానర్లు, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రముఖులు, సినీ, రాజకీయ నాయకులు ఆలయాన్ని సందర్శించినప్పుడు గౌరవప్రదంగా స్వాగతం పలికి వారి దర్శనాలను ప్రచారం చేయాలన్నారు. దేవస్థాన వాస్తు సంబంధిత అంశాలపై చర్చించిన ఎమ్మెల్యే, అవసరమైతే ఆలయ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కొన్ని కుటుంబాలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. దేవాలయ ఆదాయం, ఖర్చులు, విరాళాల వినియోగంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రతినెల ఆర్థిక నివేదికను కమిటీ ముందు ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో దేవస్థాన ఛైర్మన్, టెంపుల్ కమిటీ డైరెక్టర్లు, రామారెడ్డి, ఇస్సనపల్లి సర్పంచ్‌లు బపాల్గొన్నారు.

## సమాజసేవలో రెడ్‌క్రాస్ సంస్థ ముందుంటుంది..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సమాజసేవలో నిజామాబాద్ రెడ్‌క్రాస్ సంస్థ సంస్థ ముందుంటుందని ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా డేను పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డూ నంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఛైర్మ న్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోశాధికారి కరిపే రవీందర్, కార్యదర్శి గోక అరుణ్ బాబు, డివిజన్ ఛైర్మన్ డాక్టర్ శ్రీశైలం, వెంకటేశ్వర్లు, రాజేష్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బొద్దుల రామకృష్ణ, రెడ్‌క్రాస్ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.



## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 17,789 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. ఫస్టియర్ పరీక్షలకు 11,425 మంది, సెకండియర్ పరీక్షలకు 6,364 మంది హాజరుకానున్నారని వివరించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ పరీక్షలు, సాయంత్రం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. వార్షిక పరీక్షల తరహాలోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కూడా సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా ప్రతీ అంశాన్ని కూలంకషంగా పరిశీలిస్తూ తుది ఏర్పాట్లు పూర్తి చేయాలని పాలనాధికారి ఆదేశించారు. ముఖ్యంగా ప్రైవేట్ సెంటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎక్కడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, పోస్టల్, మెడికల్ అండ్ హెల్త్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా రక్షిత మంచినీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్, నిజామాబాద్ ఏసీపీ బి.ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందిస్తాం..

**అక్షరటుడే, మెండోరా:** అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందజేస్తామని మెండోరా ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల అంశంపై శుక్రవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు పథకం ప్రయోజనాలు త్వరగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడం లక్ష్యంగా అధికారులు కృషి చేయాలన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వదలపర్తి సర్పంచ్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని ఆడపిల్ల పెళ్లికి అండగా నిలిచారు వదలపర్తి సర్పంచ్ సత్యబోయిన పద్మ నారాయణ. పెళ్లి సందర్భంగా తన వంతుగా రూ.5 వేలు కట్నంగా అందజేసి ఆదర్శంగా నిలిచారు. ఎన్నికల సమయంలో సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామంలో ఎవరి ఇంట్లోనైనా ఆడపిల్ల పెళ్లి జరిగితే పెళ్లిరోజు రూ.5 వేలు కట్నంగా ఇస్తానని పద్మనారాయణ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం గ్రామానికి చెందిన పరమల్ల దుర్గవ్వ కూతురు రమ్య వివాహ వేడుకలో సర్పంచ్ పద్మనారాయణ స్వయంగా పాల్గొని రూ.5వేలు నగదును కట్నంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, గ్రామాభివృద్ధితో పాటు పేదలకు అండగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ చొరవను గ్రామస్థులు, మహిళలు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పేద కుటుంబాలకు కొంత భరోసా ఇస్తాయని పేర్కొన్నారు.




# రాత్రివేళ ధాన్యం విక్రయాలు..

■ వారంరోజులుగా తారాస్థాయికి ఉష్ణోగ్రతలు.. ■ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూలీలకు అవస్థలు ■ రాత్రివేళల్లో జోరుగా పనులు

**భానుడి ప్రతాపానికి ప్రజలు కుదేలవుతున్నారు. నిప్పులు కురిపిస్తున్న ఎండలకు పగటిపూట బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన అన్నదాతలు వాటిని విక్రయించేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డి డివిజన్‌లో రాత్రివేళలో కొనుగోళ్లు పూర్తి చేసుకుంటున్నారు.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి డివిజన్‌లో గత వారం రోజులుగా 44 – 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూడు నెలల పాటు రేయింబవళ్లు కష్టపడి పండించిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలను కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పగటిపూట ఎండ వేడిమి తాళలేక సూర్యాస్తమయం తర్వాత పనులు మొదలుపెడుతున్నారు.

### రాత్రిపూట కళకళలాడుతున్న కేంద్రాలు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై, పొలాల్లో రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజాము వరకు సందడిగా మారుతున్నాయి. పంట నూర్పిడి, తూకం వేయడం, లారీల్లో ధాన్యం ఎక్కించడం లాంటి పనులన్నీ చంద్రుడి వెలుగులోనే సాగుతున్నాయి. ట్రాక్టర్ల లైట్లు, సెల్‌ఫోన్ టార్చ్‌ల వెలుగులో కూలీలు, రైతులు చెమటోడుస్తున్నారు. పగలు 10 నుంచి 5 వరకు బయట అడుగు పెడితే కాళ్లు కాలిపోతున్నాయని.. కూలీలు కూడా రాత్రిపూటే వస్తామంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. హమాలీల కొరత, లారీల కోసం నిరీక్షణతో రాత్రంతా కాపలా కాయాల్సి వస్తోందని అని అన్నదాతలు తెలిపారు.

### వైద్యుల సూచనలు..

ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని, తలకు టోపీ లేదా టవల్ కట్టుకోవాలని సూచిస్తున్నారు.

### అధికారుల స్పందన..

రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ సౌకర్యం కల్పించామని, రాత్రిపూట కూడా సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. సౌకర్యాలు మాత్రం నామమాత్రంగానే ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు మరికొన్ని రోజుల పాటు భానుడి భగభగలు తగ్గేట్టు లేకపోవడంతో చంద్రుడి చల్లదనంలో ఉపశమనం పొందుతూ అన్నదాతలు తమ కష్టాన్ని కొనసాగిస్తున్నారు.



## బాల్కొండలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రం ప్రారంభం




**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో ర్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్ మాట్లాడుతూ శిక్షణ 15 రోజులపాటు ఉంటుందని తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకుని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ర్యాంప్ సంస్థ ఫీల్డ్ మేనేజర్ భరత్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, శిక్షకురాలు కీర్తన, సంతోషి, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లిలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామంలో ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కిరాణా షాపులు, చాయ్ హోటళ్ల యజమానులకు సర్పంచ్ మహేష్ యాదవ్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ టీ కప్పులు, ప్లాస్టిక్ ఇస్తార్లు, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పాలకవర్గం తరపున త్వరలో స్టీల్ టీ గ్లాసులను ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి మండల టాపర్‌కు సన్మానం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పదో తరగతి పరీక్షల్లో మండల కేంద్రానికి చెందిన బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థిని ముస్కాన్ 577 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం ముస్కాన్‌ను ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్కాన్‌కు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌ను కూడా కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం సమాజ పురోగతికి ఎంతో అవసరమన్నారు. ముస్కాన్ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా.. ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని ముస్కాన్ నిరూపించిందని కొనియాడారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని ముస్కాన్‌కు అభినందనలు తెలిపారు.

## సర్దాల్‌పూర్‌లో పశు వైద్య శిబిరం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని సర్దాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గడ్డి గింజలను పంపిణీ చేశారు. ఎండాకాలంలో పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పశు సంవర్ధక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి కోరారు. శిబిరంలో 12 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేశారు. 4 పశువులకు కృత్రిమ గర్భధారణ, 26 ఇతర జీవాలకు సాధారణ వైద్యం అందించారు. వేసవిలో పశువులకు తగినన్ని నీరు, నీడ కల్పించాలని, పచ్చగడ్డితో పాటు ఖనిజ మిశ్రమం అందించాలని పశువైద్యురాలు అర్చన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ అర్చన, జేవీవో అనిల్, సిబ్బంది మహబూబ్, సాయి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పశువులకు వైద్య సేవలు అందించారు.



## ఉపాధి పనుల పరిశీలన

**అక్షరటుడే, మాక్లూర్:** మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో బ్రహ్మానందం పరిశీలించారు. చెరువు వద్ద గల పని ప్రదేశానికి శుక్రవారం వెళ్లిన ఆయన హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఉన్న కూలీలతో మాట్లాడారు. ఎండ వేడిమి అధికంగా ఉండడంతో ఉదయం పూటే తొందరగా కొలత ప్రకారం పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.




## కొత్తపల్లిలో పశువైద్య శిబిరం

**అక్షరటుడే, మాక్లూర్:** కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మండల పశువైద్యాధికారి ఉమా సాహెర్ నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పశుపోశకులకు గర్భకోశ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమా సాహెర్ మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల్లో కనిపించే లక్షణాలను వివరించారు. మేలు జాతి దూడ, గేదెలను శిబిరంలో ప్రదర్శించారు. గేదెలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ మంచి పశుగ్రాసంతో పాటు మినరల్ మిక్చర్ అందిస్తే అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నకుమారి, కార్యదర్శి సాగర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మార్ట్‌లో చోరీ.. రూ.లక్ష ఎత్తుకెళ్లిన దొంగలు




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. అర్ధరాత్రి ఓ మార్ట్‌లో చొరబడిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు రూ.లక్ష నగదు తీసుకుని పారిపోయారు. పట్టణంలోని శ్లోక మార్ట్ సిబ్బంది ఎప్పటిలాగే గురువారం రాత్రి మూసేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి తర్వాత ఇద్దరు యువకులు మార్ట్ అద్దాలు పగులగొట్టి లోపలికి చొరబడినట్లుగా తెలుస్తోంది. మార్ట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలో చోరీకి పాల్పడిన వ్యక్తుల దృశ్యాలు రికార్డయ్యాయి. క్యాష్ కౌంటర్ వద్ద డ్రాలో ఇద్దరు యువకులు నగదు కోసం వెతికినట్టుగా సీసీ కెమెరాలో రికార్డయింది. నగదు లభించగానే పారిపోయారు. రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం మార్ట్ ఓపెన్ చేయడానికి వెళ్లిన యాజమాన్యం పగిలిన అద్దాలను చూసి ఆందోళనకు గురైంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పైప్‌లైన్ గుంతలో పడిన కారు.. దంపతులకు గాయాలు



**అక్షరటుడే, కామారెడ్డి :** అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ గుంతలో కారు పడింది. ఈ ఘటనలో భార్యాభర్తలు గాయపడ్డారు. రామారెడ్డి మండలం రంగంపేట శివారులో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. కామారెడ్డి కి చెందిన మొగుళ్ల వనిత రమేష్‌గౌడ్ దంపతులు కారులో రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. అయితే రంగంపేట శివారులో రైల్వే గేటు వద్ద అండర్ గ్రౌండ్ పైప్ లైన్ కోసం భారీ గుంతలు తవ్వారు. పక్కనే వేసి ఉన్న పైపులను ఢీకొని కారు ఒక్కసారిగా పైప్ లైన్ కోసం తవ్విన గుంతలో పడిపోయింది. కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో వారు గాయాలతో బయట పడ్డారు. కారులో చిక్కుకున్న భార్యాభర్తల కేకలు విన్న స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో భార్యాభర్తలను గుంతలో నుంచి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని వెంటనే కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు. పైప్‌లైన్ గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదని, అందువల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## 27వ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 27వ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలో కార్పొరేటర్ కల్పె అర్చన చిరంజీవి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రెయినేజీ, తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతామని కార్పొరేషన్ కమిషనర్ హామీ ఇచ్చారు. సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణ పరిష్కారం కోసం కార్పొరేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే సంబంధిత కార్పొరేటర్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట 27వ డివిజన్ కాలనీవాసులు ఉన్నారు.

